


www.aakshitha.com

People's voice

అక్షిత

జాతీయ దినపత్రిక

AKSHITHA NATIONAL DAILY

# తెలంగాణ దిక్సూచి

గురువారం | 17 | సెప్టెంబర్ | 2026 | పేజీలు: 08


# సజావుగా ఎస్ఐఆర్ ప్రక్రియ

**జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్**

**అనామిలిస్ మ్యామింగ్ ఓటర్ల జాబితా వేగవంతం చేయాలి**

**కుల ధృవీకరణ పత్రాలు అవసరమైన వారికి త్వరితగతిన జారీ చేయాలి**

**బిఎల్ఓలు సరైన ప్రణాళికతో విధులు నిర్వహించాలి**



**ఖమ్మం/అక్షిత బ్యూరో :** ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ప్రస్తుతం మ్యాపింగ్ కానీ అనామిలిస్ జాబితాలో ఉన్న వారందరికీ నోటీసుల జారీ డాక్యుమెంట్స్ అప్లోడ్ ప్రక్రియ వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఎన్నికల సిబ్బందిని ఆదేశించారు. బుధవారం స్థానిక బస్ డిపో రోడ్ పాత డిఆర్డీఏ కార్యాలయ పరిధిలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా బూత్ లెవల్ అధికారులు నిర్వహిస్తున్న విధులను ..మిగతా 2లో

కూల్చివేతలు లేకుండా

# బైపాస్ రోడ్డు

**80 అడుగుల రహదారి కోసం**

**180 భవనాలు తొలగించాలా?**

**రూ.18 కోట్ల నిధులు తెచ్చింది నేనే**

**ఫిర్యాదులతో పనులు అడ్డుకుంటోంది స్థానిక ఎమ్మెల్యేనే: జగ్గారెడ్డి**



**సంగారెడ్డి, అక్షిత బ్యూరో:** సంగారెడ్డి పట్టణంలోని బైపాస్ రోడ్డు అభివృద్ధి పనులను ప్రజలు, వ్యాపారులకు నష్టం కలగకుండా చేపట్టాలన్నదే తన ఉద్దేశమని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు జగ్గారెడ్డి తెలిపారు. మంగళవారం సాయంత్రం బసవేశ్వర విగ్రహం నుంచి ఎల్ఐసీ కార్యాలయం వరకు హెచ్ఎండీఏ, మున్సిపల్ అధికారులు, కాంగ్రెస్ ..మిగతా 2లో



# వెంటాడే కలాల జన్మస్థలి కోదాడ

**20న బీసీ కవుల అలాయ్**

**బలాయ్ "వెంటాడే కలాలు పుస్తక రజతోత్సవ వేడుకల సభను విజయవంతం చేయాలి**

**పుస్తక సంపాదకుడు, తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ జూలూరు గౌరీ శంకర్**



**కోదాడ, అక్షిత ప్రతినిధి :** తెలుగు సాహిత్య చరిత్రలో ఒక అధ్యాయంగా నిలచిన "వెంటాడే కలాలు- వెనుకబడిన కులాలు" సంకలనానికి కోదాడ జన్మస్థలి కావడం గర్వకారణంగా ఉందని పుస్తక సంపాదకుడు, తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ జూలూరు గౌరీ శంకర్ అన్నారు. ఓనమాలు దిద్దించి నడక నేర్పిన నడిగూడెం, సామాజిక స్పృహనందించిన కోదాడ మట్టిస్ఫూర్తితోనే "వెంటాడే కలాలు" సంకలనం తీసుకువచ్చినట్లు ఆయన తెలిపారు. హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 20న జరిగే బీసీ కవుల అలాయ్ బలాయ్ "వెంటాడే కలాలు" పుస్తక రజతోత్సవ సందర్భంగా కోదాడలో బుధవారం నాడు రాయపూడి చిన్ని, బంగారు నాగమణి, వేముల వెంకటేశ్వర్లు, బాణాల వసంత, సిరికొండ శ్రీనివాస్, పుప్పాల కృష్ణమూర్తి, సరికొండ నరసింహారాజు తదితరుల నేతృత్వంలో రజతోత్సవ ..మిగతా 2లో

# సంపూర్ణ అక్షరాస్యత లక్ష్యం



**కలెక్టర్ డాక్టర్ సత్య శారద**

**వరంగల్, అక్షిత బ్యూరో:** వరంగల్ జిల్లాకు కేటాయించిన లక్ష్యానికి అనుగుణంగా ఉల్లాస్ పరీక్షలను విజయవంతంగా నిర్వహించి, నిర్దేశిత లక్ష్యాన్ని పూర్తి చేసేలా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన కన్వర్జెన్సీ సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, సెప్టెంబర్ 20వ తేదీన చేసిన నిర్వహించనున్న ఉల్లాస్ పరీక్షకు ఉల్లాస్ పోర్టల్‌లో ..మిగతా 2లో

# పటిష్టంగా ఓటర్ల జాబితా

**స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్**



**దేవరకద్ర, అక్షిత న్యూస్:** 76--దేవరకద్ర అసెంబ్లీ నియోజకవర్గం ఈఆర్ఓ మధుసూదన్ నాయక్ బుధవారం దేవరకద్ర తహసీల్దార్ కార్యాలయంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, ఓటర్ల జాబితా సవరణలో భాగంగా ..మిగతా 2లో

www.aakshitha.com People's voice
అక్షిత
AKSHITHA NATIONAL DAILY



## వెంటాడే కలాల జన్మస్థలి కోదాడ



**మొదటి పేజీ తరువాయి...**

పోస్టర్ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జూలూరు మాట్లాడుతూ... 2001లో పల్లెలు చిద్రమై, కులవృత్తులు ధ్వంసమై, బడుగుల బతుకులు అల్లకల్లోలమైపోతున్న ప్రపంచీకరణ నేపథ్యంలో "వెంటాడే కలాలు" సంకలనం తీసుకురావడం జరిగిందన్నారు. ఇందులో 23 మంది బీసీ కవులు తమ ఆత్మకథనాత్మక వ్యధల్ని ఆవిష్కరించారని అన్నారు. చారిత్రాత్మకమైన రాష్ట్రస్థాయి దళిత సాహిత్య సదస్సుకి 1995లో కోదాడ పట్టణమే ఆతిథ్యమిచ్చి నిర్వహించిందని గుర్తు చేశారు. 1935 ల నుంచే నడిగూడెంకు గొప్ప సాహిత్య చరిత్ర ఉందన్నారు. రాజా నాయని వెంకట రంగారావు నడిగూడెం సంస్థానం నుంచే విజ్ఞాన చంద్రిక గ్రంథమండలి పేరున 60 పుస్తకాలు వెలువరించడం జరిగిందని సింహావలోకనం చేశారు. హైదరాబాదులో 20న జరిగే "వెంటాడే కలాలు రజతోత్సవ సభకు" రాష్ట్రం నలుమూలల నుంచి మూడు 300కు పైగా బీసీ కవులు హాజరవుతారని జూలూరు గౌరీశంకర్ తెలియజేశారు. ఈ సందర్భంగా పుస్తక సంపాదకులు కవి జూలూరు గౌరీశంకర్ ను త్రివేణి, వాగ్దేవి, రేస్ కళాశాలల చైర్మన్ బాణాల వసంత ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో... రామ నరసయ్య, హరి కిషన్, పొట్ట జగన్నాథం, షేక్ మీరా,డి.ఎన్. స్వామి, జి.ఎల్.ఎన్ రెడ్డి, జూలూరు వీరభద్రం, బాదేరాము,కొలిచలం శ్రీనివాస్, త్రివేణి డిగ్రీ, జూనియర్ కళాశాల విద్యార్థులు, కవులు, కళాకారులు పాల్గొన్నారు.

## కూల్చివేతలు లేకుండా బైపాస్ రోడ్డు



**మొదటి పేజీ తరువాయి...**

నాయకులతో కలిసి కాలినడకన పర్యటించిన ఆయన రహదారి పరిస్థితిని పరిశీలించారు. ప్రస్తుతం ఉన్న రహదారి విస్తీర్ణాన్ని అధికారులతో కొలిపించి, అభివృద్ధి పనులకు సంబంధించిన అంశాలపై వారితో చర్చించారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ బైపాస్ రోడ్డు అభివృద్ధికి తాను రూ.18 కోట్ల నిధులు మంజూరు చేయించానని చెప్పారు. 80 అడుగుల రహదారి నిర్మాణం చేపడితే సుమారు 180 భవనాలను తొలగించాల్సి వస్తుందని, వారికి కోట్ల రూపాయల నష్టపరిహారం చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఇది ఆచరణలో సాధ్యమవుతుందా అని ప్రశ్నించారు. ఎలాంటి కూల్చివేతలు లేకుండా 50 అడుగుల మేర రహదారిని అభివృద్ధి చేయవచ్చని, దీనివల్ల ఇళ్లు, దుకాణాలు, మెట్లు తొలగించాల్సిన అవసరం ఉండదన్నారు. భవన యజమానులు, ఫుట్‌పాత్ వ్యాపారులకు నష్టం కలగకుండా, వాహనదారులకు ఇబ్బందులు లేకుండా రహదారి నిర్మాణం చేపట్టాలని అధికారులకు సూచించారు. తాను రూ.18 కోట్ల నిధులు తీసుకొచ్చి రహదారి అభివృద్ధికి చర్యలు చేపడుతుంటే స్థానిక ఎమ్మెల్యే అధికారులకు ఫిర్యాదులు చేస్తూ పనులను అడ్డుకుంటున్నారని ఆరోపించారు. హెచ్ఎండీఏ కమిషనర్‌కు, విజిలెన్స్ విభాగానికి ఫిర్యాదులు చేయడం వల్ల అధికారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. స్థానిక ఎమ్మెల్యేకు నిజంగా 80 అడుగుల రహదారి అవసరమని భావిస్తే బైపాస్ రోడ్డుపైకి వచ్చి ప్రజల సమక్షంలో కూల్చివేతలపై తన వైఖరిని స్పష్టం చేయాలని జగ్గారెడ్డి డిమాండ్ చేశారు. ప్రజల ఆస్తులకు నష్టం కలగకుండా, ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా రహదారి అభివృద్ధి చేపట్టడమే తన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.

# సంపూర్ణ అక్షరాస్యత లక్ష్యం




**మొదటి పేజీ తరువాయి...**

నమోదైన ప్రతి మహిళ హాజరయ్యేలా చూడాల్సిన బాధ్యత మండల స్థాయిలోని అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్లపై ఉందన్నారు. పోర్టల్‌లో నమోదైన అభ్యర్థులందరినీ పరీక్షకు హాజరయ్యేలా ముందస్తుగా అవగాహన కల్పించి, అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. మహిళలందరినీ అక్షరాస్యులుగా తీర్చిదిద్దడం ద్వారా జిల్లాలో అక్షరాస్యత శాతాన్ని పెంచేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ అన్నారు. ఉల్లాస్ కార్యక్రమం ద్వారా నిరక్షరాస్యులకు విద్యను అందించి, వారిలో చదువు పట్ల ఆసక్తిని పెంపొందించేలా క్షేత్రస్థాయిలో విస్తృతంగా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు.అదేవిధంగా తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ద్వారా వరంగల్ జిల్లాలో పదో తరగతి, ఇంటర్మీడియట్ కోర్సుల్లో అడ్మిషన్లు ఆశించిన స్థాయిలో లేవని కలెక్టర్ తెలిపారు. జిల్లాకు కేటాయించిన అడ్మిషన్ లక్ష్యాన్ని పూర్తిచేసేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. అర్హులైన విద్యార్థులు ఓపెన్ స్కూల్ సొసైటీ ద్వారా విద్యను కొనసాగించేలా విస్తృత ప్రచారం నిర్వహించి, నిర్దేశిత లక్ష్యాన్ని సాధించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు.ఉల్లాస్ పరీక్షలు, ఓపెన్ స్కూల్ అడ్మిషన్ల లక్ష్యాలను సాధించేందుకు సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.ఈ సమావేశంలో జిల్లా డీఆర్డీఓ నాగపద్మజ, జిల్లా విద్యాశాఖ అధికారి రంగయ్య నాయుడు, అడల్ట్ ఎడ్యుకేషన్ ఉమ్మడి జిల్లా డిప్యూటీ డైరెక్టర్ రమేష్ రెడ్డి, డీఎంసీ రేణుక, ఓపెన్ స్కూల్ సొసైటీ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ సదానందం, వరంగల్ జిల్లా ఉల్లాస్ ఇన్‌చార్జి నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



# పటిష్టంగా ఓటర్ల జాబితా



**మొదటి పేజీ తరువాయి...**

సంబంధిత ఓటర్లకు నోటీసులు జారీ చేసి, వాటిని నిర్ణీత విధంగా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. నోటీసులు అందుకున్న ఓటర్లు విచారణకు హాజరై తమకు సంబంధించిన వివరాలు, అవసరమైన ఆధారాలను సమర్పించాల్సి ఉంటుందని వివరించారు. నిర్ణీత షెడ్యూల్ ప్రకారం విచారణ ప్రక్రియను పూర్తి చేయనున్నట్లు తెలిపారు.

నోటీసుల పంపిణీ లేదా విచారణల నిర్వహణ సమయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు గుర్తించే సమస్యలు, ఇబ్బందులను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు. ఓటర్లు విచారణలకు హాజరై తమ వివరాలను సమర్పించేలా అవగాహన కల్పించి, ప్రక్రియ సజావుగా పూర్తయ్యేందుకు అధికారులకు సహకరించాలని సూచించారు. ఓటర్ల జాబితా సవరణకు సంబంధించిన నోటీసుల పంపిణీ, విచారణలు పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేలా అన్ని వర్గాలు సహకరించాలని అదనపు కలెక్టర్ కోరారు.

సమావేశంలో దేవరకద్ర తహసీల్దార్, ఎఈఆర్ఓ, దేవరకద్ర మున్సిపల్ కమిషనర్, ఎం.పి.డి.ఓ, వివిధ గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# సజావుగా ఎస్ఐఆర్ ప్రక్రియ



**మొదటి పేజీ తరువాయి...**

జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనామిలిస్ మ్యాపింగ్ కాని ఓటర్ల వివరాలను బిఎల్ఓ లు యాప్ లో నమోదు చేసే విధానాన్ని పరిశీలించారు. ప్రత్యక్షంగా హియరింగ్ కు హాజరైన ఓటర్ల తో ఎదురైన సమస్యలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ నోటీసులు అందుకున్న ఓటర్లు నిర్దేశిత తేదీల్లో హియరింగ్ కు హాజరయి బిఎల్వోలకు అవసరమైన డాక్యుమెంట్లను సమర్పించాలని తెలిపారు.ఎస్ఐఆర్ ప్రక్రియపై బిఎల్వోలు సరైన ప్రణాళికతో విధులు నిర్వహించాలని నోటీసులు అందుకున్న వారిలో ఏబిసి కేటగిరీల వారీగా సంబంధిత ఓటర్లతో అవసరమైన డాక్యుమెంట్లను మాత్రమే తీసుకోవాలని కుల ధృవీకరణ పత్రాలు అవసరమైన వారికి మంజూరు చేసేలా ఇప్పటికే రెవెన్యూ అధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు.

అర్హులైన ఏ ఒక్కరి ఓటు గల్లంతు కాకుండా తప్పులు లేని పారదర్శకమైన సమగ్ర ఓటరు జాబితాను రూపొందించాలనే ఉద్దేశంతో ఎన్నికల సంఘం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎస్ఐఆర్ ను జిల్లాలో విజయవంతం చేయాలని కలెక్టర్ అన్నారు.మ్యాపింగ్ కాని అనామిలిస్ జాబితాలో ఉన్న వారందరికీ నోటీసులు జారీ చేశాక నిర్దేశిత తేదీల్లో హియరింగ్ కు హాజరయ్యేలా చూడాలన్నారు. అవసరమైన వారికి కులధృవీకరణ పత్రాలు తీసుకువచ్చే విధంగా అవగాహన కల్పించాలన్నారు.

నోటీసుల జారీ ఓటర్ల హియరింగ్ ఫారాల స్వీకరణ అప్‌లోడింగ్ ప్రక్రియలను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. ఓటర్లు సమర్పించే ధ్రువీకరణ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించాలని వాటిపై తప్పనిసరిగా సంబంధిత ఓటర్ల సంతకాలు తీసుకోవాలని తెలిపారు. అర్హత కలిగిన ప్రతి ఒక్క ఓటరు వివరాలు ఓటరు జాబితాలో ఉండేలా అధికారులు ప్రక్రియను నిర్వహించాలని విధులు కేటాయించిన సిబ్బంది సమన్వయంతో పనిచేసి నిర్దేశించిన గడువులోగా ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు.

ఈ తనిఖీల సందర్భంగా జిల్లా కలెక్టర్ వెంట సంబంధిత అధికారులు బిఎల్ఓ లు ఎన్నికల సిబ్బంది తదితరులు ఉన్నారు.

# పేదోడికి ఇల్లు ఇవ్వలేని ఇందిరమ్మ రాజ్యంలో సర్పంచ్ ఎందుకు

## సర్వసభ్య సమావేశంలో సర్పంచుల ఆవేదన..రాజకీయ జోక్యంపై అసంతృప్తి



**చిన్నంబావి, అక్షిత న్యూస్:** చిన్నంబావి మండలంలో బుధవారం మండల అభివృద్ధి కార్యాలయం ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశంలో భారత రాజ్యాంగం ప్రకారం ప్రజలచే ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధులు తమ సమస్యలను అధికారుల ముందు పెట్టారు. గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేయాలనుకుంటున్నా, అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని సర్పంచులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల చేత సర్పంచ్ గా ఎన్నుకోబడిన తమకు పేదోడికి ఇల్లు ఇప్పించలేని అధికారం లేనప్పుడు తామెందుకు సర్పంచ్ గా కొనసాగాలి..? సర్పంచి పదవికి రాజీనామా చేస్తామంటూ సర్పంచులు మండల అభివృద్ధి అధికారితో



వాగ్వివాదం చేసిన సంఘటన చిన్నంబావి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం లో నెలకొన్నది. చిన్నంబావి మండల సర్వసభ్య సమావేశం మండల అభివృద్ధి అధికారి ఆదర్శ గౌడ్ ఆధ్వర్యం లో సమావేశం లో సర్పంచులు మాట్లాడుతూ... గ్రామాలలో సొంత ఇల్లు లేని పేదవారికి ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయడానికి తమకు అధికారము లేకుండా అధికారపక్ష పార్టీల నాయకులు చేస్తున్నారని అధికారపక్ష పార్టీకి చెందని సర్పంచులను ప్రజాప్రతినిధులను చులకనగా చూస్తున్నారని, నిర్లక్ష్యం చేస్తున్నారని ప్రజల చేత సర్పంచిగా ఎన్నికైన తమకు పేదవాడికి ఇల్లు మంజూరు చేయించే అధికారం లేనప్పుడు తమను ఎన్నుకున్న ప్రజలకు ముఖము చూపించలేకపోతున్నామని అధికారం లేని సర్పంచ్ పదవి మాకెందుకు సర్పంచ్ పదవికి రాజీనామా చేస్తామంటూ సమావేశం లో పాల్గొన్న వివిధ గ్రామాల సర్పంచులు చిన్నంబావి మండల అభివృద్ధి అధికారి ఆదర్శ్ గౌడ్ తో సమావేశం లో వాగ్వివాదం చేస్తూ హెచ్చరించారు.తెలంగాణలో కాంగ్రెస్ ప్రజాపాలన కేవలం స్వలాభాల రాజకీయాల కోసమే కొనసాగుతున్నట్లుగా ఉందని పలువురు సర్పంచులు అసంతృప్తి వ్యక్తం చేశారు. కనీసం నిరుపేద కుటుంబానికి ఇల్లు ఇప్పించాలని సంకల్పంతో సర్పంచ్‌గా పనిచేస్తున్నప్పటికీ రాజకీయాలు అడ్డంకిగా మారుతున్నాయని వాపోయారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రజలు ఎన్నుకున్న సర్పంచులకు అధికారాలు ఎందుకని ప్రశ్నించారు. సర్పంచ్‌గా గెలిచి గ్రామంలో తిరగాలంటే సిగ్గుగా ఉందని, ముఖంపై బట్ట వేసుకొని తిరిగే పరిస్థితి ప్రస్తుత ప్రజాపాలనలో నెలకొందని పలువురు సర్పంచులు ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలపై చర్చ సందర్భంగా సమావేశంలో కొంతసేపు వాగ్వాదం చోటుచేసుకుని రసాభాసగా మారినట్లు తెలిపారు.

# దండ వేసి దండం పెట్టి... చెత్త వేయవద్దు

## పూలదండలతో గాంధీగిరి, రూ. 500 జరిమానా విధించిన మున్సిపల్ అధికారులు

## రోడ్డు పక్కన చెత్త వేస్తే చర్యలు తప్పవు

## చౌటుప్పల్ మున్సిపల్ చైర్ పర్సన్ మోగుదాల పావని రమేష్ గౌడ్



**చౌటుప్పల్ /అక్షితన్యూస్:** పరిసరాను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని చౌటుప్పల్ మున్సిపల్ చైర్ పర్సన్ మోగుదాల పావని రమేష్ గౌడ్ హెచ్చరించారు. చౌటుప్పల్ మున్సిపల్ చైర్ పర్సన్ మోగుదాల పావని రమేష్ గౌడ్, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర నాయక్ ఆదేశాల మేరకు బుధవారం నేషనల్ హైవే 65 వలిగొండ జంక్షన్ నుండి లింగోజిగూడెం వెళ్లే రహదారి పక్కన నిబంధనలకు విరుద్ధంగా నలుగురు వ్యక్తులు చెత్త వేస్తుండగా వారిని మున్సిపల్ సిబ్బంది పట్టుకున్నారు.వారికి పరిశుభ్రతపై అవగాహన కల్పించేందుకు గాను, చెత్త వేస్తూ దొరికిన వారికి వినూత్నంగా మర్యాదపూర్వకంగా పూలదండలు వేసి రహదారుల పక్కన చెత్త వేయకూడదని దండం పెట్టి మరి విజ్ఞప్తి చేశారు. అనంతరం వారికి రూ. 500 జరిమానా విధించారు.

రోజూ మూడు షిఫ్టుల్లో వివిధ కంపెనీలకు విధులకు వెళ్లే కొంతమంది వ్యక్తులు ఈ విధంగా మార్గమధ్యలో రోడ్డు పక్కన చెత్తను పడేస్తున్నారని, దీనివల్ల వారానికొకసారి సిబ్బంది మొత్తం అక్కడ శుభ్రం చేయడానికే సమయం సరిపోతోందని అధికారులు తెలిపారు. కావున జాతీయ రహదారికి ఇరువైపులా రోడ్డు పక్కన చెత్త వేసి అపరిశుభ్రం చేయవద్దని కోరారు. ప్రజలందరూ మున్సిపాలిటీ చెత్తా సేకరణ వాహనాలకే చెత్తను అందించాలని, రహదారులను,పరిసరాలను శుభ్రంగా ఉంచడంలో మున్సిపల్ యంత్రాంగానికి సహకరించాలని మున్సిపల్ అధికారులు విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్స్పెక్టర్ హనుమాన్ ప్రసాద్, పర్యావరణ ఇంజనీర్ రేణు కుమార్, జవాన్ అంజయ్య, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# గ్రామాల్లో భూ సర్వే ప్రారంభం

## తొలి విడతలో నాలుగు గ్రామాల ఎంపిక..

## గ్రామాల్లో హద్దుల నిర్ధారణకు శ్రీకారం

**రామన్నపేట అక్షిత ప్రతినిధి:** తెలంగాణ ప్రభుత్వం ఆదేశాల మేరకు రామన్నపేట మండలంలో భూ సర్వే ప్రక్రియ ప్రారంభమైంది. మండలంలోని తొలి విడతలో నిదానపల్లి, బాచుప్పల, సూరారం, తుర్కపల్లి గ్రామాలను భూ సర్వేకు ఎంపిక చేసినట్లు తహసీల్దార్ లాల్ బహదూర్ తెలిపారు. భూ సర్వేలో భాగంగా మంగళవారం నిదానపల్లి గ్రామంలో భూముల హద్దుల నిర్ధారణ ప్రక్రియను అధికారులు ప్రారంభించారు. సర్వే సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటించి భూముల హద్దులను పరిశీలించడంతో పాటు సంబంధిత వివరాలను నమోదు చేశారు.



ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా సర్వే ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ తెలిపారు. భూ సర్వే సందర్భంగా రైతులు తమ భూములకు సంబంధించిన వివరాలను అందుబాటులో ఉంచి, సర్వే సిబ్బందికి అవసరమైన సహకారం అందించాలని ఆయన సూచించారు. భూముల హద్దుల నిర్ధారణతో భవిష్యత్తులో భూ సంబంధిత సమస్యల పరిష్కారానికి మార్గం సుగమం అవుతుందని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ శోభ, సర్వేయర్ సోనీ, జీపీఓ లక్ష్మి, నిదానపల్లి సర్పంచ్ నారపాక మాధవి--యాదయ్య, బోగారం సర్పంచ్ కూనూరు సాయికుమార్ గౌడ్, ఆయా గ్రామాలకు చెందిన రైతులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మోడల్ స్మశాన వాటికకు నిధులు కేటాయించాలి

## స్థానిక ఎమ్మెల్యేకు 63వ డివిజన్ స్థానిక తాజా మాజీ కార్పొరేటర్ వినతి




**కాజీపేట్, అక్షిత ప్రతినిధి :** హనుమకొండ పశ్చిమ నియోజకవర్గ 63 డివిజన్ లో బుధవారం హిందూ స్మశాన వాటికలో పరిశుద్ధ కార్మికులతో గ్యాంగ్ వర్క్ నిర్వహించడం జరిగింది.మోడల్ స్మశాన వాటికను రూపు రేఖలు మార్చడానికి నిధులు ఇవ్వాలని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డిని కోరడం జరిగింది అని స్థానిక తాజా మాజీ కార్పొరేటర్ సయ్యద్ విజయశ్రీ రజాలి తెలిపారు .ఎమ్మెల్యే స్పందిస్తూ అతి త్వరలో మోడరన్ స్మశాన వాటికల సౌకర్యాలు,బర్నింగ్ వార్డ్ స్నానపు గదులు, బొక్కలు భద్రపరిచే గదులు ఇతర కార్యక్రమాలు నిర్వహించడానికి షెడ్డు ఏర్పాటు చేస్తామని ఈ సందర్భంగా తెలియజేశారు. స్మశాన వాటికలో శాశ్వత ప్రాతిపదికన సౌకర్యాలు కల్పిస్తే సమస్యలు తొలగిపోతాయని డివిజన్ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

# టీచర్స్ కాలనీలో ఘనంగా గణేష్ నవరాత్రి ఉత్సవాలు

## మూడవరోజు ప్రత్యేక పూజలు, భక్తుల రద్దీ

**కోదాడ, సెప్టెంబర్ 16:(అక్షిత న్యూస్):** టీచర్స్ కాలనీలో నిర్వహిస్తున్న శ్రీ గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో మూడవ రోజు బుధవారం వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి దర్శనం చేసుకున్నారు.కాలనీ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపంలో గణేష్ మహారాజుకు పుష్పాలు, పండ్లు, నైవేద్యాలతో ప్రత్యేక అలంకరణ చేశారు. ఉదయం పూజారులు వేద మంత్రాలతో గణపతి పూజలు నిర్వహించగా, భక్తులు కోలాహలంగా హాజరై



మొక్కులు చెల్లించుకున్నారు.ఈ సందర్భంగా కాలనీ వాసులు భక్తి శ్రద్ధలతో ఉత్సవాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ నెల 22 వరకు నవరాత్రి ఉత్సవాలు కొనసాగనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

www.aakshitha.com
People's voice
అక్షిత
AKSHITHA NATIONAL DAILY
జాతీయ దినపత్రిక

గురువారం | 17| సెప్టెంబర్| 2026

# జడ్పీహెచ్ఎస్ హైస్కూల్ విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రస్సుల పంపిణీ



**చిలుకూరు, సెప్టెంబర్ 16(అక్షిత న్యూస్):** ఆచార్యులగూడెం జడ్పీహెచ్ఎస్ హైస్కూల్ విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రస్సుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ స్పోర్ట్స్ డ్రస్సులను దాత మల్ల ప్రగడ రామారావు మిత్రులు, వైజాగ్ వాస్తవ్యులు అందజేశారు. ఈ స్పోర్ట్స్ డ్రస్సులను ఆచార్యుల గూడెం గ్రామ మహాదాత మైలారిశెట్టి చిన్న యలమందయ్య చేతుల మీదుగా పంపిణీ చేయడం జరిగింది. విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు స్పోర్ట్స్ డ్రస్సులను అందించిన దాతలకు పాఠశాల సిబ్బంది, గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ క్రీడల్లో విద్యార్థులు చురుకుగా పాల్గొని పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు మరియు జట్టు స్ఫూర్తిని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు మరియు తల్లిదండ్రులు పాల్గొని విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులు అందించిన స్పోర్ట్స్ డ్రెస్‌లను సద్వినియోగం చేసుకొని విద్యతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని కోరారు

# బహిరంగ ప్రదేశంలో చెత్త వేయకూడదు



**అక్షిత న్యూస్ హాలియా 16 సెప్టెంబర్ 2026 :** నాగార్జున సాగర్ నియోజకవర్గం హాలియా మున్సిపాలిటీ సాగర్ రోడ్ లో బహిరంగ ప్రదేశంలో చెత్తను పడవేసిన గోపాల్ ఆటో మెకానిక్ వర్క్స్ వారికి వెయ్యి రూపాయలు జరిమానా విధించారు మున్సిపల్ కమిషనర్ కే రవీందర్ రెడ్డి ఆదేశాల మేరకు హాలియా పట్టణంలో ప్రత్యేక దృష్టి సారిస్తూ బహిరంగ ప్రదేశాల్లో చెత్తకు పడవేసే వారిపై మున్సిపల్ సిబ్బంది చర్యలు చేపట్టారు పట్టణ ప్రజలు వ్యాపారులు బహిరంగ ప్రదేశాల్లో చెత్తను వేయకుండా తడి పొడి చెత్తను మున్సిపల్ సిబ్బందికి అందించాలని అధికారులు సూచించారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడం, నిబంధనలు ఉల్లంఘించే వారిపై నిబంధన ప్రకారం జరిమానాలు తెలిపారు

# భక్తిశ్రద్ధలతో గణపతి హోమం

## కార్యక్రమాన్ని నిర్వహించిన మహావాది జలజ సత్యనారాయణ దంపతులు

## కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు



**పెద్దపెల్లి, అక్షిత ప్రతినిధి:** గణపతి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని మంథని పట్టణంలోని తమ్మి చెరువు కట్ట వీధిలో గణపతి హోమం కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహావాది జలజ సత్యనారాయణ దంపతులు ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. చతుర్థి దీక్ష తీసుకున్న అనంతరం ఉద్యాపన కార్యక్రమం అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేసి అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. మంథనిలో అతి పురాతనంగా తమ్మి చెరువు కట్ట వీధిలో గల శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో గణపతి నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తూ శాస్త్రోక్తంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు మహావాది దయానంద్ తెలిపారు. దయానంద్ ఆధ్వర్యంలో గత మూడు సంవత్సరాలుగా ఆలయ అభివృద్ధి కార్యక్రమాలు విశేషంగా జరుగుతున్నాయి.

# అపశృతులకు తావు లేకుండా నిమజ్జనాన్ని పకడ్బందీగా చేపట్టాలి

## వినాయక నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్, ఎస్పీ



**గద్వాల అక్షిత న్యూస్:** జిల్లాలో వినాయక విగ్రహాల నిమజ్జనం జరిగే ప్రాంతాల్లో ఎలాంటి అపశృతులు చోటు చేసుకోకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, ఎస్పీ శ్రీనివాసరావు అన్నారు.

బుధవారం ఎర్రవల్లి మండలంలోని బీచుపల్లి కృష్ణా నది పుష్కర ఘాట్ల వద్ద వినాయక నిమజ్జన కార్యక్రమం నిర్వహించనున్న ప్రాంతాన్ని జిల్లా కలెక్టర్, ఎస్పీ సందర్శించి నిమజ్జన ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిమజ్జన ప్రాంతానికి పెద్ద విగ్రహాలు, వాహనాలు సులభంగా చేరుకునేలా రహదారి చదును చేయడం, అవసరమైన చోట్ల మట్టి, మొరం, రాళ్లను ఉపయోగించి రహదారిని బాగు చేయాలని అధికారులను ఆదేశించారు.



నిమజ్జన రహదారిలో ఉన్న చెట్ల కొమ్మలు వాహనాల రాకపోకలకు అడ్డంకిగా ఉన్న ప్రాంతాలను గుర్తించి అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. పెద్ద విగ్రహాలను తరలించే సమయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని తెలిపారు. నిమజ్జన ప్రాంతంలో రాత్రి వేళల్లో భక్తులు, నిర్వాహకులు, వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగినంత లైటింగ్ ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.

భక్తుల రాకపోకలు, భారీ వాహనాల రాకపోకలకు ప్రత్యేక మార్గాలు ఏర్పాట్లు చేయాలన్నారు. చిన్న విగ్రహాలతో వచ్చే భక్తులు ఒక నిర్దిష్ట మార్గంలో వెళ్లేలా, పెద్ద విగ్రహాల భారీ వాహనాలకు ప్రత్యేక మార్గం ఉండేలా బారికేడింగ్ ఏర్పాటు చేయాలని తెలిపారు. నిమజ్జన ప్రాంతంలోకి అనవసరంగా వాహనాలు ప్రవేశించకుండా నియంత్రణ చర్యలు చేపట్టి, ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని పోలీసు అధికారులకు సూచించారు.

నిమజ్జన ఏర్పాట్లలో జెసిబిలు, క్రేన్లు,రోలర్లు, ఇతర అవసరమైన వాహనాలను అందుబాటులో ఉంచాలని సూచించారు. వాహనాల వినియోగానికి సంబంధించి డ్యూటీ వివరాలు, సంబంధిత సిబ్బంది సంతకాలు, రోజువారీ రికార్డులను తప్పనిసరిగా నిర్వహించాలని తెలిపారు. ప్రథమ చికిత్స కేంద్రాలు, వైద్య సిబ్బంది మరియు అత్యవసర సేవలను అందుబాటులో ఉంచాలన్నారు. మత్స్యకారులు, గజ ఈతగాళ్ల సేవలను వినియోగించుకోవాలన్నారు. సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి నిమజ్జన కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు.

ఈ పర్యటనలో ఆర్డీవో శ్రీనివాసరావు, డిఎస్పి మొగిలయ్య, ఇతర శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# వినాయక నిమజ్జనానికి పక్కాగా ఏర్పాట్లు చేయాలి

## జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

## సిరిసిల్ల మానేరు తీరంలో నిమజ్జన వేడుకల ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితె



**రాజన్న సిరిసిల్ల, అక్షిత:** వినాయక నిమజ్జనానికి ఏర్పాట్లు పక్కాగా చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. వినాయక విగ్రహాల నిమజ్జనానికి సిరిసిల్లలోని మానేరు తీరంలోని ప్రేమ్ నగర్, బ్రిడ్జి వద్ద చేస్తున్న ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితె పలు శాఖల అధికారులతో కలిసి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. వినాయక మండపాల నిర్వాహకులు తమ విగ్రహాలను భక్తి శ్రద్ధల మధ్య వేడుకలు నిర్వహిస్తూ వైభవంగా తరలించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ అధికారులకు సహకరించాలని కోరారు.

అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ముందుకు వెళ్ళి, వేడుకలను విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. వినాయక నిమజ్జనానికి కావలసిన నీటి సౌకర్యం, స్టేజ్, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని, వైద్య సేవలు, అగ్ని మాపక శాఖ అధికారులు సేవలు అందించాలని, పారిశుధ్య పనులు చేయించాలని, క్రేన్లు అందుబాటులో పెట్టాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ఇక్కడమున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ, ఆర్డీఓ శ్రీధర్ బాబు, డీఎస్పీ నాగేంద్రాచారి, నీటి పారుదల శాఖ అధికారి దయాకర్, జిల్లా వైద్యాధికారి ఏంజెలా ఆల్ఫ్రెడ్, జిల్లా మత్స్య శాఖ అధికారి సౌజన్య, తహసీల్దార్ మహేష్, మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

# అట్టహాసంగా పోషణ మాస ఉత్సవాలు

## చంద్రుపట్లలో గర్భిణులకు సామూహిక శ్రీమంతాలు..

## పోషకాహారం, రక్తహీనత నివారణపై అవగాహన




**సత్తుపల్లి , అక్షిత న్యూస్:** కల్లూరు మండల పరిధిలోని చంద్రుపట్ల సెక్టార్, చంద్రుపట్ల గ్రామపంచాయతీ పరిధిలోని అంగన్వాడీ కేంద్రాల్లో బుధవారం పోషణ మాస ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణీ స్త్రీలకు సామూహిక శ్రీమంతాల వేడుకలను నిర్వహించారు. జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ అధికారి ఏ. ప్రమీలఆధ్వర్యంలోనిర్వహించిన ఈ కార్యక్రమంలో గర్భిణీలు, బాలింతలు, కిశోర బాలికలు, మహిళలకుపోషకాహారం,రక్తహీనత నివారణపై అవగాహన కల్పించారు. గర్భిణీలు,బాలింతలు ప్రతిరోజూ పౌష్టికాహారం తీసుకోవాలని, విటమిన్లు, ప్రోటీన్లు, ఐరన్ సమృద్ధిగా ఉండే ఆహార పదార్థాలనుతీసుకోవడం ద్వారారక్తహీనతనునివారించవచ్చని సూచించారు. సీడీపీఓ నిర్మల జ్యోతి మాట్లాడుతూ అంగన్వాడీకేంద్రాలద్వారాఅందిస్తున్న పౌష్టికాహారాన్నిలబ్ధిదారులుసద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని అవగాహన కల్పించారు. డీహెచ్ఈడబ్ల్యూ--ఖమ్మం జిల్లా మిషన్ కోఆర్డినేటర్ ఎస్.డీ. సమ్రీన్ మాట్లాడుతూ పీసీపీఎన్డీటీ చట్టం, బేటీ బచావో--బేటీపడావోకార్యక్రమాలపై అవగాహన కల్పించారు. ఆడపిల్లల ప్రాముఖ్యత, బాలికల విద్య, భద్రత, సమగ్ర అభివృద్ధిపై వివరించారు. చంద్రుపట్ల హైస్కూల్ బాలికలకుమాసికధర్మ పరిశుభ్రత, వ్యక్తిగతపరిశుభ్రత,ఆరోగ్యం,పోషకాహారంపై అవగాహన కల్పించారు. గర్భిణీ మహిళలకు మహిళా హెల్ప్‌లైన్ 181, శక్తి సదన్ వంటి మహిళా సహాయక సేవలగురించివివరించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుజాత, సూపర్‌వైజర్ కల్యాణి, ఏపీ శ్రీనివాసరావు, సర్పంచ్ విజయ, పంచాయతీకార్యదర్శిలక్ష్మణరావు,లక్ష్మి,వెంకటేశ్వరరావు, వార్డు సభ్యులు సీతారాములు, రవి, పాఠశాల ఉపాధ్యాయులు జ్యోతి, పద్మ, మంగమణి, యశోదతదితరులు, అంగన్వాడీ సిబ్బంది, ఆయాలు, తల్లులు, పిల్లలు, గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# వరి ధాన్యం సేకరణ పకడ్బందీగా నిర్వహించాలి

**రైస్ మిల్లుల్లో నిల్వ ఉన్న ధాన్యంపై క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపట్టాలి**

**లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీని వేగవంతం చేయాలి**

**జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**



**గద్వాల అక్షిత ప్రతినిధి:** జోగులాంబ గద్వాల జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు నిబంధనల ప్రకారం పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఐడీఓసీ కాన్ఫరెన్స్ హాల్లో ధాన్యం కొనుగోలుపై సంబంధిత శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు.

అక్టోబర్ 1వ తేదీ నుంచే అన్ని కొనుగోలు కేంద్రాలు పూర్తి సౌకర్యాలతో పనిచేసేలా ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు.

గన్ని బ్యాగులు, టార్పాలిన్లు, తూకం యంత్రాలు, ప్యాడీ క్లీనర్లు, తేమ నిర్ధారణ యంత్రాలు అందుబాటులో ఉంచాలని, రైతుల నుంచి హమాలీ, గన్ని బ్యాగులు తదితరాల పేరుతో ఎలాంటి అదనపు చార్జీలు వసూలు చేయరాదని స్పష్టం చేశారు. ధాన్యం తేమ శాతాన్ని పరీక్షించి



నమోదు చేయడంతో పాటు ప్రతి కేంద్రంలో మూవ్‌మెంట్ రిజిస్టర్, ఇన్‌చార్జిని తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

కొనుగోలు కేంద్రాల్లో టోల్‌ఫ్రీ నంబర్, కనీస మద్దతు ధర, బోనస్ తదితర వివరాలతో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని, ధాన్యం నిల్వలకు అవసరమైన బఫర్ గోదాములను గుర్తించాలని సూచించారు.

కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎంపిక చేసిన, సాధ్యమైనంత తక్కువ దూరంలో ఉన్న మిల్లులకు వెంటనే తరలించాలని, ఓపీఎంఎస్‌లో వివరాలను రోజువారీగా అప్‌డేట్ చేయాలని తెలిపారు. రైతులకు చెల్లింపులు సకాలంలో, పారదర్శకంగా జరిగేలా చూసి పెండింగ్ బిల్లులను త్వరితగతిన పరిష్కరించాలని, కొనుగోలు సిబ్బందికి ముందస్తు శిక్షణ ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు.

రాష్ట్ర సరిహద్దుల వద్ద చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి ఇతర రాష్ట్రాల నుంచి ధాన్యం అక్రమంగా జిల్లాలోకి రాకుండా కట్టుదిట్టమైన నిఘా ఏర్పాటు చేయాలని, రవాణా శాఖ అధికారులు పర్యవేక్షణను ముమ్మరం చేయాలని కలెక్టర్ సూచించారు. విజిలెన్స్ అధికారులు రైస్ మిల్లులు, కొనుగోలు కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తారని తెలిపారు. రైస్ మిల్లుల్లో గతంలో కొనుగోలు చేసిన ధాన్యం నిల్వలపై తహసీల్దార్లు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి, వివరాలను డీజీఎస్‌సీ/పీవీ యాప్‌లో నమోదు చేయాలని ఆదేశించారు.

తప్పుడు నివేదికలు సమర్పించినా, క్షేత్రస్థాయిలో తనిఖీలు చేయకుండా నివేదికలు నమోదు చేసినా, విధుల్లో నిర్లక్ష్యం వహించినా కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు.

అలాగే అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి స్మార్ట్ రేషన్ కార్డు అందేలా ఆయా మండలాల్లో పంపిణీ కార్యక్రమాన్ని వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

జిల్లా ఎస్పీ శ్రీనివాస రావు మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని, ధాన్యం అక్రమ రవాణాను అరికట్టేందుకు రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పోలీసు శాఖ తరఫున పూర్తి సహకారం అందిస్తామని పేర్కొన్నారు.

ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ మధు మోహన్, జిల్లా పౌర సరఫరాల అధికారి స్వామి కుమార్, పౌర సరఫరాల మేనేజర్ విమల, జిల్లా వ్యవసాయాధికారి వీరప్ప, కో-ఆపరేటివ్ అధికారి శ్రీనివాస్, మార్కెటింగ్ అధికారిణి పుష్పమ్మ, ఎల్‌డీఎం శ్రీనివాసరావు, తహసీల్దార్లు, మండల వ్యవసాయ అధికారులు, డీఆర్‌డీఏ ఏపీడీ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# అదిలాబాద్‌లో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేస్తాం

**పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు కిజార్ పాషా**

**53 మంది సభ్యులతో నూతన కమిటి కార్యవర్గం**



**ఇచ్చోడ అక్షిత న్యూస్:** అదిలాబాద్ పట్టణంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేస్తామని అదిలాబాద్ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కిజార్ పాషా పేర్కొన్నారు. 53 మంది సభ్యులతో ఎన్నికైన ఆదిలాబాద్ పట్టణ కాంగ్రెస్ కమిటీ నూతన కార్య వర్గం జాబితాను బుదవారం ప్రకటించారు. ఏఐసీసీ, టీపీసీసీ, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు డా. నరేష్ జాదవ్ ఆదేశాల మేరకు ఆదిలాబాద్ పట్టణ కాంగ్రెస్ కమిటీ నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు. పట్టణంలో కాంగ్రెస్ పార్టీని క్షేత్ర స్థాయిలో మరింత బలోపేతం చేయడమే నూతన కమిటీ ప్రధాన లక్ష్యమని తెలిపారు. పార్టీ అధిష్ఠానం అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహి స్తూ, ప్రతి వార్డులో, ప్రతి బూత్ స్థాయిలో పార్టీ కార్య కలాపాలను విస్తృతం చేస్తామన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, ప్రజలకు అందుతున్న ప్రయోజనాలు, ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని నూతన కమిటీ సభ్యులకు ఆయన దిశానిర్దేశం చేశారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటి పరిష్కారం కోసం సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి ప్రజలకు అండగా నిలవాలని సూచించారు. ప్రతి వార్డు, ప్రతి బూత్‌లో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ప్రజలతో నిరంతరం మమేకమై పనిచేయాలని, యువత, మహిళలు, సీనియర్ నాయకులు, వివిధ సామాజిక వర్గాలను పార్టీతో అనుసంధానం చేస్తూ ముందుకు సాగాలని అన్నారు. ముఖ్యంగా యువతను కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేసి, వారికి నాయకత్వ అవకాశాలు కల్పించే విధంగా కార్యాచరణ రూపొందించాలన్నారు. పార్టీ కోసం కష్టపడుతున్న ప్రతి కార్యకర్తకు తగిన ప్రాధాన్యత కల్పిస్తూ, అందరినీ కలుపుకొని ముందుకు సాగుతామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ కార్యాలయ ఇన్‌చార్జ్ గౌలి సంజీవ్ కుమార్, జిల్లా కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షులు మోతీరామ్, వార్డు అధ్యక్షులు జగదీశ్వర్ రెడ్డి, ఫహీం, తిరుమని మహేందర్, జాఫర్, పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు నూతన కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## దాతృత్వం చాటుకున్న ఎమ్మెల్యే

**ప్రమాదంలో గాయపడిన యువకుడి చికిత్సకు 2 లక్షల ఆర్థిక సాయం..**



**చౌటుప్పల్ /అక్షిత న్యూస్:** మునుగోడు నియోజకవర్గం, నారాయణపురం మండలం డాకుతండా గ్రామపంచాయతీ పరిధిలోని కోపుల తండాకు చెందిన మెగావత్ రాకేష్ ఇటీవల బైక్ ప్రమాదంలో తీవ్రంగా గాయపడి హైదరాబాదులోని ఆస్పత్రిలో చికిత్స పొందుతుండంతో రాకేష్ గాయపడ్డ విషయాన్ని స్థానిక శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి దృష్టికి స్థానిక నాయకులు తీసుకు వెళ్లారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మెరుగైన వైద్య చికిత్స అందించి రాకేష్ ను బతికించాలంటూ తక్షణమే రెండు లక్షల ఆర్థిక సహాయంను అందజేశారు. స్థానిక నాయకులు రెండు లక్షల రూపాయల చెక్కును హైదరాబాదులోని ఆసుపత్రికి వెళ్లి రాకేష్ తల్లిదండ్రులకు అందించారు. మానవత దృక్పథంతో ఆర్థిక సహాయాన్ని అందజేసిన ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి ప్రమాదంలో గాయపడిన యువకుడి తల్లిదండ్రులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

## సర్పంచులను సన్మానించిన సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్



**పెద్దపెల్లి, అక్షిత ప్రతినిధి:** మంథని, మల్హార్‌రావు మండలాలకు చెందిన పలువురు నూతన సర్పంచులను సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ బుధవారం శాలువాతో ఘనంగా సన్మానించారు. మొట్టమొదటిసారిగా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) మంథనికి విచ్చేసిన సందర్భంగా పెద్దతుండ్ల సర్పంచ్ బండారి నర్సింగ రావు, పుట్టపాక సర్పంచ్ కన్నూరి రాజబాబు, మల్లారం సర్పంచ్ పొట్ల లక్ష్మీ శ్రీకాంత్‌లను కొత్త శ్రీనివాస్ శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా కొత్తగా ఎన్నికైన సర్పంచులు తమ గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తూ, ప్రజలకు అందుబాటులో ఉంటూ గ్రామాల సమగ్ర అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంఘ డైరెక్టర్ కిషన్ రెడ్డి, వార్డు మెంబర్ కన్నూరి సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

## ఏఐ నైపుణ్యాలతో ఉపాధి అవకాశాలు




**రామన్నపేట అక్షిత ప్రతినిధి:** రామన్నపేట స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆంగ్లం, వాణిజ్య శాస్త్ర విభాగాల ఆధ్వర్యంలో "ఉద్యోగాల నైపుణ్య సాధనలో ఏఐ టూల్స్" అంశంపై మూడు రోజుల కార్యశాల బుధవారం ప్రారంభమైంది. కళాశాల ప్రధానాచార్యులు ఆచార్య రాహత్ ఖానం మాట్లాడుతూ.. ఆధునిక ఉద్యోగ రంగంలో ఏఐ టెక్నాలజీ కీలకంగా మారిందన్నారు. విద్యార్థులు ఏఐ పై అవగాహన, నైపుణ్యాలను పెంపొందించుకుని ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఐబీఎం ప్రోగ్రామ్ మేనేజర్ సాయి రాఘవేంద్ర ఏఐ నైపుణ్యాల ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఆచార్య ఆర్. రత్నమంజుల, అకడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ డి. కిషన్, విభాగాధిపతులు డాక్టర్ ఎన్. లక్ష్మి నీలిమ, డాక్టర్ జి. సునీత, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

www.aakshitha.com
People's voice
అక్షిత
AKSHITHA NATIONAL DAILY

# పేదోడి కళ్ళల్లో వెలుగులు నింపడమే మా ధ్యేయం

**సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి**

**ఉచిత కంటి వైద్య శిబిరానికి జనప్రభంజనంలా కదిలిన జనం..**

**నేటితో ముగిసిన ఉచిత కంటి పరీక్షల ప్రక్రియ..**

**రెండు రోజులుగా 61 మంది కంటి శుక్లాల పేషెంట్లకు విజయవంతంగా ఆపరేషన్లు పూర్తి..**

**గత ఆరు రోజుల్లో 5,740 మందికి పైగా శిబిరాన్ని సందర్శించగా.. 3,702 మందికి పైగా ఉచిత కంటి పరీక్షలు**

**2,350 మందికి పైగా ఉచిత కంటి అద్దాల పంపిణీ**

**154 మంది కంటి శుక్లాల ఆపరేషన్లకు ఎంపిక..**



**కల్వకుర్తి అక్షిత ప్రతినిధి:** కడ్తాల్‌లోని ఎంబీఏ గార్డెన్స్‌లో ఐక్యత ఫౌండేషన్ చైర్మన్,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు టాస్క్ సి ఓ ఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి సహకారంతో శంకర నేత్రాలయ,చెన్నైవైద్య నిపుణులచే నిర్వహిస్తున్న సుంకిరెడ్డి 6వ మెగా ఉచిత కంటి వైద్య శిబిరం ఆరో రోజు కూడా ప్రజల భారీ స్పందనతో కొనసాగింది..కడ్తాల్ మండలం, పరిసర గ్రామాల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో శిబిర ప్రాంగణం జనంతో కిక్కిరిసిపోయింది,ఒక్కరోజే 1,500 మందికి పైగా శిబిరానికి హాజరై కంటి వైద్య సేవలను వినియోగించుకున్నారు.ఈ సందర్భంగా

సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి మాట్లాడుతూ కడ్తాల్‌లో ఆరు రోజులుగా నిర్వహిస్తున్న ఈ కంటి వైద్య శిబిరానికి ప్రజల నుంచి లభిస్తున్న స్పందన ఎంతో ఆనందాన్ని కలిగిస్తోంది. ముఖ్యంగా చివరి రోజు కూడా 1,500 మందికి పైగా ప్రజలు శిబిరానికి రావడం ద్వారా కంటి వైద్య సేవల అవసరం ఎంతగా ఉందో తెలుస్తోంది, మంగళవారం నాడు శిబిరానికి హాజరైన వారిలో 940 మందికి పైగా ఉచిత కంటి పరీక్షలు 680 మందికి పైగా ఉచిత కంటి అద్దాల పంపిణీ ఆరవ రోజు 25 మంది కంటి శుక్లాల పేషెంట్లకు కంటి ఆపరేషన్ల ఎంపిక చేయడం జరిగింది,అలాగే కంటి శుక్లాల ఆపరేషన్ల ప్రక్రియ లో బాగంగా.రెండో రోజు హాజరైన 29 మందికి విజయవంతంగా కంటి శుక్లాల ఆపరేషన్లు పూర్తి,నేటితో కంటి పరీక్షల ప్రక్రియ ముగిసినా.కంటి శుక్లాల ఆపరేషన్లు సెప్టెంబర్ 19 వరకు కొనసాగుతాయి,ఇప్పటికే రెండు రోజుల ఆపరేషన్లలో 61 మంది పేషెంట్లకు విజయవంతంగా శస్త్రచికిత్సలు పూర్తయ్యాయి..

గ్రామీణ ప్రాంతాల్లోని పేద,మధ్యతరగతి ప్రజలకు కంటి వైద్యం కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా,వారి ప్రాంతంలోనే ఉచితంగా వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం

పేదోడి కళ్లలో వెలుగులు నింపడమే మా సేవా సంకల్పం,ప్రజలకు అవసరమైన సేవా కార్యక్రమాలను భవిష్యత్తులో కూడా నిరంతరం కొనసాగిస్తాం."అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ జడ్పీటీసీ దశరథ్ నాయక్ మాట్లాడుతూ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు కంటి వైద్య సేవలను ఉచితంగా అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమని తెలిపారు,ఆరు రోజుల పాటు ఇంత పెద్ద స్థాయిలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించడం,వేలాది మంది ప్రజలకు కంటి పరీక్షలు చేయించడం,అవసరమైన వారికి ఉచితంగా కంటి అద్దాలు అందించడం,కంటి శుక్లాల సమస్యతో బాధపడుతున్న వారికి ఉచితంగా ఆపరేషన్లు నిర్వహించడం ఎంతో గొప్ప సేవా కార్యక్రమం,ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు కంటి వైద్యం ఖర్చుతో కూడుకున్న అంశంగా మారుతున్న పరిస్థితుల్లో వారి ప్రాంతంలోనే ఉచితంగా పరీక్షలు,అద్దాలు,ఆపరేషన్ల సదుపాయం కల్పించడం ద్వారా సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి ఎంతోమంది పేద కుటుంబాలకు అండగా నిలుస్తున్నారు,ప్రజల అవసరాలను గుర్తించి,ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తూ ఇలాంటి సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగించడం అభినందనీయం,ఈ సేవా కార్యక్రమం ద్వారా మరెంతోమంది ప్రజలకు ప్రయోజనం కలగాలని,భవిష్యత్తులో సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో మరిన్ని ప్రజా సేవా కార్యక్రమాలు కొనసాగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను అని మాజీ జడ్పీటీసీ దశరథ్ నాయక్ పేర్కొన్నారు,ఈ కార్యక్రమంలో.మాజీ జడ్పీటీసీ దశరథ్ నాయక్,కాంగ్రెస్ పార్టీ కడ్తల్ మండల అధ్యక్షులు పోతుగంటి శంకర్,వైస్ ఎంపిపి ఆనంద్,సర్పంచ్ లు సేవ్యనాయక్,ప్రియ రమేష్,శ్రీను నాయక్,మాజీ ఎంపిపి పంతు నాయక్,మాజీ సర్పంచ్ లు హరిచంద్, భూనాద్,ఉప సర్పంచ్ పండు నాయక్,వార్డు సభ్యులు నాగార్జున,దేవుల,సీనియర్ నాయకులు గోపాల్,శక్రూ,శ్రీను,జగన్,బీక్యా నాయక్ లతో పాటు తదితరులు పాల్గొన్నారు

# రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత

**ట్రాఫిక్ సిఐ నందగిరి వెంకటేష్**




**చౌటుప్పల్ /అక్షిత న్యూస్:** జాతీయ రహదారిపై రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యతని చౌటుప్పల్ ట్రాఫిక్ సిఐ నందగిరి వెంకటేష్ అన్నారు.యాదాద్రి భువనగిరి జిల్లా ఎస్పీ, ట్రాఫిక్ డీఎస్పీ సూచనల మేరకు బుధవారం చౌటుప్పల్ ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో మాతృశ్రీ డిగ్రీ కళాశాలలో రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు సిబ్బందికి ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు భద్రతా చర్యలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సిఐ నందగిరి వెంకటేష్ మాట్లాడుతూ... వాహనాలు నడిపేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని, ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలన్నారు.రోడ్డు ప్రమాదాల నివారణకు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్ తప్పనిసరి ధరించాలన్నారు. అలాగే కారులో ప్రయాణించేటప్పుడు సీట్ బెల్ట్ ధరించాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# గణపతికి డీఎస్పీ మధుసూదన్‌రెడ్డి ప్రత్యేక పూజలు

**పోలీస్‌స్టేషన్‌లో భక్తిశ్రద్ధలతో పూజలు..**

**అనంతరం అన్నదానం**



**రామన్నపేట అక్షిత ప్రతినిధి:** మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ గోపాతి సతీష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడికి బుధవారం డీఎస్పీ మధుసూదన్‌రెడ్డి, సీఐ మెలుగు రవి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పోలీస్‌స్టేషన్‌లో భక్తిశ్రద్ధలతో గణపతి పూజా కార్యక్రమాన్ని నిర్వహించి, పోలీసు సిబ్బంది క్షేమం, ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం పోలీస్‌స్టేషన్ ఆవరణలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ సిబ్బంది, భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# టీజేఏ ఖమ్మం ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా ఎండి రషీద్ ప్రధాన కార్యదర్శిగా ఎం.చిన్ని




**ఖమ్మం /అక్షిత బ్యూరో :** టీజేఏ ఖమ్మం ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా ఎండి రషీద్ ప్రధాన కార్యదర్శిగా ఎం చిన్ని ను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. బుధవారం ఖమ్మం ప్రెస్ క్లబ్ లో రసీదుకు శాలువతో సన్మానం చేసి స్వీట్లు తినిపించారు. ఈ కార్యక్రమంలో టీజేఏ జిల్లా అధ్యక్షులు జి నాగ స్వామి కే జిల్లా గౌరవ అధ్యక్షులు మణికుమార్ టీజేఏ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ సయ్యద్ ఖాసిం జిల్లా నాయకులు వాసం రాజేంద్రప్రసాద్ నల్లమోతు శ్రీనివాసరావు పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# సురక్షిత ప్రసవాలపై ప్రత్యేక దృష్టి

**ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే మెరుగైన వైద్యం**

**హైరిస్క్ గర్భిణులను ముందుగానే గుర్తించాలి**

**వైద్య సిబ్బందికి పీఓ డాక్టర్ సాజిద ఆదేశం**

**నెక్కొండ పీహెచ్‌సీలో రికార్డుల తనిఖీ**





**నర్సంపేట అక్షిత ప్రతినిధి :** గ్రామీణ స్థాయిలో మాతాశిశు మరణాలను అరికట్టడమే లక్ష్యంగా వైద్య సిబ్బంది పని చేయాలని ప్రోగ్రామ్ ఆఫీసర్ (పీఓ ఎంహెచ్ఎన్) డాక్టర్ సాజిద ఆదేశించారు. ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లి ప్రజలు ఆర్థికంగా నష్టపోకుండా, ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. బుధవారం ఆమె నెక్కొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని (పీహెచ్‌సీ) సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని రిజిస్టర్లు, నివేదికలు, రికార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేసి, సిబ్బంది పనితీరును అడిగి తెలుసుకున్నారు.

అనంతరం పీహెచ్‌సీ వైద్య సిబ్బందితో ఆమె మాట్లాడుతూ.. ఆసుపత్రి పరిధిలోని పల్లెల్లో గర్భిణుల నమోదు ప్రక్రియ వంద శాతం పక్కాగా జరగాలన్నారు. వారికి ప్రతి నెలా క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు (ఏఎన్‌సీ) నిర్వహించాలన్నారు. ముఖ్యంగా రక్తహీనత, అధిక రక్తపోటు (బీపీ), తక్కువ వయసులో గర్భం దాల్చడం వంటి సమస్యలున్న 'హైరిస్క్' గర్భిణులను ప్రాథమిక దశలోనే గుర్తించాలన్నారు. వారికి ప్రత్యేక వైద్యం అందించడం ద్వారా ప్రసవ సమయంలో ముప్పును నివారించవచ్చని స్పష్టం చేశారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, ఉన్నతాధికారులు నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో చేరుకోవాలని ఆదేశించారు.

**తల్లిపాలే బిడ్డకు శ్రీరామరక్ష**

పీహెచ్‌సీలో వైద్య పరీక్షల కోసం వచ్చిన గర్భిణులతో సాజిద నేరుగా మాట్లాడారు. ఇంట్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వారికి వివరించారు. గర్భస్థ దశలో పౌష్టికాహారం తీసుకోవడంతో పాటు, వైద్యులు సూచించిన ఐరన్, ఫోలిక్ యాసిడ్ మాత్రలు తప్పనిసరిగా వాడాలని సూచించారు. బిడ్డ పుట్టిన గంటలోపు తప్పనిసరిగా ముర్రుపాలు పట్టించాలని, తల్లిపాలే శిశువుకు శ్రీరామరక్ష అని, దానివల్ల పిల్లల్లో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని అవగాహన కల్పించారు. ప్రసవానంతరం తీసుకోవాల్సిన జాగ్రత్తలు, శిశు సంరక్షణ పద్ధతులను వివరించారు.

ఈ కార్యక్రమంలో నెక్కొండ మండల వైద్యాధికారి డాక్టర్ రహేల తస్వీర్, పీహెచ్ఎన్ అన్నమేరి, హెచ్ఎస్ వరమ్మ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్, స్థానిక ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# పట్టణాభివృద్ధికి భవిష్యత్తు కార్యాచరణను ప్రకటించాలి

**ముస్సిపాలిటీ పన్నుల వసూలు కేంద్రంగా మారింది...**

**క్షేత్రస్థాయిలో కనీస సౌకర్యాలు శూన్యం...**

**యుద్ధ ప్రతిపాదికన డ్రైనేజీలను పూడిక తీయాలి...**

**అక్రమ నిర్మాణాల పట్ల చర్యలు తీసుకోవాలి...**

**బీసీవై పార్టీ,తెలంగాణ రాష్ట్ర పీఏసీ సభ్యులు డాక్టర్ చిలకల శ్రీనివాస్ యాదవ్**




**చౌటుప్పల్/ అక్షిత న్యూస్:** చౌటుప్పల్ మున్సిపాలిటీ కేవలం ప్రజల జేబులు ఖాళీ చేసే పన్నుల వసూలు కేంద్రంగా మారిపోయిందని, ప్రభుత్వ ఖజానా నింపడంలో చూపిస్తున్న అత్యుత్సాహం ప్రజలకు మౌలిక వసతులు కల్పించడంలో చూపించడం లేదని, అధికారులు, నాయకులు చౌటుప్పల్ అభివృద్ధికి తీసుకుంటున్న స్పష్టమైన భవిష్యత్తు కార్యాచరణను ప్రకటించాలని డాక్టర్ చిలుకల శ్రీనివాస్ యాదవ్ అన్నారు.బుధవారం ఆయన మాట్లాడుతూ...

చౌటుప్పల్ పట్టణంలో వర్షపు నీరు, మురుగునీరు సాఫీగా దిగువకు వెళ్లాల్సిన సహజసిద్ధమైన నాలాలు, మురుగు కాలువలు, ప్రవాహ మార్గాలను అధికార పక్ష నేతలు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు యథేచ్ఛగా ఆక్రమించి కాంక్రీట్ కట్టడాలు నిర్మిస్తుంటే అధికారులు చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని డాక్టర్ చిలకల శ్రీనివాస్ యాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

రెక్కాడితే గానీ డొక్కాడని సామాన్యుడు తనకున్న రెండు గుంటల జాగలో చిన్న నిర్మాణం చేపడితే రూల్ బుక్ పట్టుకుని కొలతలు వేస్తూ, జరిమానాలు విధిస్తూ వేధించే మున్సిపల్ అధికారులు... ఎకరాల కొద్దీ నాలాలను, చెరువుల అలుగులను పూడ్చి భారీ వాణిజ్య సముదాయాలు నిర్మిస్తుంటే కళ్లు అప్పగించి ఎందుకు చూస్తున్నారని ప్రశ్నించారు. అధికార పక్ష నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గి అక్రమ నిర్మాణాలకు కొమ్ముకాస్తున్న అధికారులు ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు.

నాలాల ఆక్రమణల ఫలితంగా అకాల వర్షాలు వస్తే మురుగునీరంతా లోతట్టు కాలనీలు, బస్తీలను ముంచెత్తి వందలాది కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.నాలాల ఆక్రమణల వల్ల ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లితే సంబంధిత మున్సిపల్ కమిషనర్, ఇంజనీరింగ్ అధికారులు బాధ్యత వహిస్తారా అని ప్రశ్నించారు.

మున్సిపాలిటీ పారిశుధ్య విభాగం పూర్తిగా కాగితాలకే పరిమితమైందని, క్షేత్రస్థాయిలో ప్రజలు కంపు వాసనల మధ్య, రోగాల భయంతో కాలం వెళ్లదీస్తున్నారని ఆరోపించారు.

పట్టణంలోని ఆసుపత్రులు, నర్సింగ్ హోమ్‌ల నుంచి వచ్చే సిరంజీలు, బ్యాండేజీలు, రక్తంతో కూడిన వ్యర్థాలు సాధారణ చెత్త కుప్పల్లో దర్శనమిస్తున్నాయన్నారు. అధికారుల పర్యవేక్షణ లోపం ప్రజల ప్రాణాల మీదకు తెస్తోందన్నారు.

పారిశ్రామిక ప్రాంతం నుంచి వచ్చే విష వాయువులు, రసాయన వ్యర్థాలతో భూగర్భ జలాలు కలుషితమై ప్రజలు క్యాన్సర్లు, శ్వాసకోశ వ్యాధులు చర్మవ్యాధుల బారిన పడుతుంటే సంబంధిత పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, మున్సిపల్ యంత్రాంగం తగిన చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం వహిస్తుందన్నారు.

భావితరాల భవిష్యత్తు కోసం,సమస్యల పరిష్కారానికి స్పష్టమైన కార్యాచరణ ప్రకటించకపోతే ప్రజలతో కలిసి చౌటుప్పల్ మున్సిపల్ కార్యాలయాన్ని దిగ్బంధించడంతో పాటు జిల్లా కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని డాక్టర్ చిలకల శ్రీనివాస్ యాదవ్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో

బీసీవై పార్టీ నాయకులు ఎండీ జావేద్,సర్వైల్ శ్రీనివాస్,ఆడెపు బిక్షపతి,మారుతి వికాస్ యాదవ్,దామలింగ స్వామి పాలుగొన్నారు.

## స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో దివ్యాంగ,ఒంటరి మహిళలకు తోపుడు బండ్లు





**సత్తుపల్లి, అక్షిత న్యూస్:** కల్లూరు మున్సిపాలిటీ పరిధిలో స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాల్లో ముఖ్య అతిథులుగా పాల్గొన్న దాతలు శాంతినగర్ మరియు బత్తులపల్లిలో ఒంటరి దివ్యంగురాళ్ళైన మహిళలకు వ్యాపార నిమిత్తం నాలుగు చక్రాల బండ్లు (తోపుడు బండ్లు) స్ఫూర్తి ఫౌండేషన్ చైర్మన్ శ్రీవ్యాల్ చేతులు మీదుగా అందించటం జరిగింది. శాంతినగర్ లో ఖమ్మంపాటినాగేశ్వరి(దివ్యంగురాలు), బత్తులపల్లికి చెందిన ఒంటరి మహిళ పోతిని సుశీలకు ఆర్థికంగా వ్యాపారం చేసుకోవటానికి తోపుడు బండ్లు అందించారు. గత నెలలో ఎకంగా ఫౌండేషన్ సహాయంతో 50 డ్యూయల్ డెస్క్ బెంచీలను అందించిన కొన్ని పాఠశాలలను సందర్శించి, పాఠశాలల్లో సమస్యలను తెలుసుకొని సమస్యల పట్ల సుముఖత వ్యక్తం చేయడం జరిగింది. వాచ్చనాయక్ తండా, జిడిపి పల్లి,కలాలివాడ,జడ్.పి.హెచ్.ఎస్, గర్ల్స్ హై స్కూల్, బత్తులపల్లి ఎంపీపీఎస్ పాఠశాలను సందర్శించారు. ఈకార్యక్రమంలో స్ఫూర్తి ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఉయ్యూరి శ్రీవ్యాల్ శత్రుజ్ఞుడు, రామలక్ష్మి , కల్లూరు స్ఫూర్తి ఫౌండేషన్ కమిటీసభ్యులు ఉబ్బనబాబురావు,జల్లి రామకృష్ణ ,దామాల దయాకర్ రావు,కొత్తపల్లి వెంకటేశ్వర్లు,ఉబ్బన వేణుబాబు, మరిల వెంకటేశ్వరరావు, ఫౌండేషన్ సభ్యులు, గ్రామ పెద్దలు, స్థానికులు మరియు ఇతర ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

## వినాయక విగ్రహాల నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్



**దేవరకద్ర, అక్షిత న్యూస్:** దేవరకద్ర మున్సిపాలిటీలో వినాయక విగ్రహాల నిమజ్జనం కోసం గుర్తించిన చెరువులను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ బుధవారం పరిశీలించారు. నిమజ్జనానికి సంబంధించి చేపట్టిన ఏర్పాట్లను ఆయన అధికారులను అడిగి తెలుసుకున్నారు. వినాయక విగ్రహాల నిమజ్జనం సజావుగా, ప్రశాంతంగా జరిగేలా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని, భద్రతా చర్యలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. నిమజ్జన ప్రదేశాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసు కోకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో దేవరకద్ర మున్సిపల్ కమిషనర్, ఎం.పి.డి.ఓ, మున్సిపల్ చైర్మన్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## సొంత వ్యాపారాలపై యువత దృష్టి సారించాలి

**చైర్ పర్సన్ కంఠం శిరీష కృష్ణారెడ్డి**



**మేడ్చల్, అక్షిత ప్రతినిధి:** యువత సొంత వ్యాపారాలపై దృష్టి సారించి ఇంకొంత మందికి ఉపాధి కల్పించే ఎదగాలని అలియాబాద్ మున్సిపాలిటీ చైర్ పర్సన్ కంఠం శిరీష కృష్ణ రెడ్డి అన్నారు. బుధవారం అలియాబాద్ మున్సిపల్ కేంద్రంలో మేడిపల్లి శివ నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ కట్ట మైసమ్మ వెల్డింగ్ షాప్ ను స్థానిక కౌన్సిలర్లతో కలిసి చైర్ పర్సన్ కంఠం శిరీష కృష్ణారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ యువత ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా సొంతంగా వ్యాపారాలు నిర్వహించి పదిమందికి మార్గదర్శకంగా నిలవాలన్నారు. సొంత వ్యాపారం పై దృష్టి సారించిన శ్రీ కట్ట మైసమ్మ వెల్డింగ్ షాప్ నిర్వాహకుడు మేడిపల్లి శివ ను శిరీష కృష్ణారెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ కాన్ రెడ్డి మాలతి మాధవరెడ్డి, కౌన్సిలర్లు మౌనిక దినేష్, యమున శ్యామ్, జస్వంత్ రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# బైరాన్‌పల్లి అమరుల త్యాగాలను వృథా కానివ్వం

**సీపీఐ సిద్దిపేట జిల్లా కార్యవర్గ సభ్యులు అందె అశోక్**



**చేర్యాల/ధూల్మిట్ట:** బైరాన్ పల్లి అమరుల త్యాగాలను వృధా కానివ్వం అని సీపీఐ సిద్దిపేట జిల్లా కార్యవర్గ సభ్యులు అందె అశోక్ అన్నారు. తెలంగాణ సాయుధ పోరాటం 78వ వారోత్సవాల్లో భాగంగా బుధవారం ధూళిమిట్ట మండలంలోని బైరాన్‌పల్లి గ్రామంలో సీపీఐ ఆధ్వర్యంలో అమరవీరుల స్థూపం, చారిత్రక బురుజు వద్ద పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించిన అనంతరం బురుజు వద్ద స్థానిక మండల కన్వీనర్ వలబోజు నర్సింహా చారి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నిజాం నిరంకుశ పాలన, ధన, మాన, ప్రాణ దోపిడీలకు వ్యతిరేకంగా బైరాన్‌పల్లి ప్రజలు సాగించిన పోరాటం చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగినదన్నారు. 118 మంది అమరులైన బైరాన్‌పల్లి నెత్తుటి చరిత్ర భావితరాలకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. బైరాన్‌పల్లి, గుండ్రాంపల్లి వంటి పోరాట ఖిల్లాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించి స్మృతి చిహ్నాలుగా అభివృద్ధి చేసి పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దాలని, అలాగే నాటి పోరాట చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చి భావితరాలకు అందించాలని కోరుతూ17 సెప్టెంబర్‌ను అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కిష్టపురం లక్ష్మణ్, జిల్లా సమితి సభ్యులు ఈరి భూమయ్య, మద్దూరు మండల కార్యదర్శి జంగిలి యాదగిరి, బెక్కంటి సంపత్, నంగి కనకయ్య, బైరాన్ పల్లి శాఖ కార్యదర్శి ఆరుగొండ మల్లేష్, గూడెపు సుదర్శన్, దండబోయిన వెంకటేష్, గోమరపు నర్సయ్య, బంగారు ప్రేమ్ కుమార్, శిగుళ్ల నరేష్, నంగి సత్తయ్య, కాశబోయిన చరణ్, మహిళా, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల నుంచి దృష్టి మళ్లించే ప్రయత్నమే

### బైపాస్ రోడ్డు పనులు వేగంగా పూర్తి చేయాలి.. గుంతలను పూడ్చాలి

### 80 అడుగుల రహదారి ఉన్నచోట 80 అడుగులే నిర్మించాలి: బీఆర్ఎస్ నాయకులు



**సంగారెడ్డి అక్షిత బ్యూరో:** సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే బైపాస్ రోడ్డు విషయంలో చేసిన వ్యాఖ్యలు ప్రజలు ఎదుర్కొంటున్న అసలు సమస్యల నుంచి దృష్టి మళ్లించే ప్రయత్నంగా ఉన్నాయని మాజీ సీడీసీ చైర్మన్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ విజేందర్‌రెడ్డి అన్నారు. బైపాస్ రోడ్డు అంశంపై మాజీ ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యలను బీఆర్ఎస్ నాయకులు ఖండించారు. సంగారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విజేందర్‌రెడ్డి, రామప్ప, కౌన్సిలర్లు పొన్న రాజేందర్‌రెడ్డి, శ్రీకాంత్ తదితరులు విలేకరులతో మాట్లాడారు. బైపాస్ రోడ్డుపై ప్రతిరోజూ వాహనదారులు, ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు అందరికీ తెలుసని, రహదారిపై గుంతలు, ట్రాఫిక్ సమస్యలు, పనులు నెమ్మదిగా సాగుతుండటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వారు పేర్కొన్నారు. రహదారి పనులను వేగంగా పూర్తి చేసి ప్రజలకు సౌకర్యవంతమైన ప్రయాణాన్ని కల్పించాలన్నదే ఎమ్మెల్యే చింత ప్రభాకర్ అభిమతమని తెలిపారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని 80 అడుగుల రహదారి ఉన్నచోట 80 అడుగులు, 60 అడుగుల రహదారి ఉన్నచోట 60 అడుగుల మేర నిర్మాణం చేపట్టాలని, కేవలం 50 అడుగుల రహదారితో సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందా అనే విషయాన్ని ప్రజలు ఆలోచించాలని అన్నారు. రహదారి పనుల నాణ్యత, పనులు ఆలస్యం కావడానికి కారణాలు, నిర్ణీత గడువులోగా పనులు ఎందుకు పూర్తి చేయడం లేదనే విషయాలను అధికారులు ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. అభివృద్ధి పనుల పేరుతో ప్రభుత్వ ఆస్తుల్లో మార్పులు, నిర్మాణాలు లేదా రహదారి విస్తరణ అవసరమైతే నిబంధనల ప్రకారం వాటిని పూర్తి చేయాలని సూచించారు. ఎన్నికల సమయంలో పట్టణంలోని ప్రతి వార్డుకు రూ.8 కోట్ల అభివృద్ధి నిధులు ఇస్తామని ఇచ్చిన హామీల పరిస్థితి, ఇటీవల ముఖ్యమంత్రి సంగారెడ్డికి వచ్చిన సందర్భంగా పట్టణానికి మంజూరైన నిధుల వివరాలను ప్రజలకు వెల్లడించాలని కోరారు. అలాగే రాజీవ్ పార్కు అభివృద్ధి విషయంలో సంవత్సరాలు గడుస్తున్నా పనులు పూర్తిస్థాయిలో ఎందుకు జరగడం లేదని ప్రశ్నించారు. గతంలో ఎమ్మెల్యే చింత ప్రభాకర్ కృషితో పట్టణ అభివృద్ధికి రూ.50 కోట్ల నిధులు తీసుకువచ్చి పార్టీలకు అతీతంగా వివిధ వార్డుల్లో అభివృద్ధి పనులు చేపట్టామని వారు తెలిపారు. రాజకీయ విమర్శల కంటే ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనులపై దృష్టి పెట్టాలని, బైపాస్ రోడ్డు పనులను వేగంగా పూర్తి చేసి నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, ప్రస్తుతం ఉన్న గుంతలను వెంటనే పూడ్చి ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ సీడీసీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, కౌన్సిలర్లు లాడే మల్లేశం, నవీన్, సురేష్, కసిని శ్రీకాంత్, విఠల్, వజీత్ తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్ట్ అనిల్ కుటుంబానికి అండగా ఉంటాం..

### నా వంతుగా పూర్తి సహకారం అందిస్తా..

### అవసరమైతే ఎల్ ఓ సి ఇప్పిస్తాం..

### అనిల్ తో ఫోన్ లో మాట్లాడి ధైర్యం చెప్పిన డిప్యూటీ మేయర్ ఎం ఎస్ ఆర్



**మహబూబ్ నగర్, అక్షిత న్యూస్:** మహబూబ్ నగర్ కు చెందిన జర్నలిస్టు అనిల్ భార్య గుండె సంబంధిత వ్యాధితో నిమ్స్ లో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న మహబూబ్ నగర్ డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి తన వంతుగా పూర్తి సహకారం అందిస్తానని అన్నారు. అనిల్ భార్య అనారోగ్యానికి సంబంధించి విషయాన్ని జర్నలిస్టులు నరేందర్ చారి, సతీష్ రెడ్డి, గోకులం వెంకటేష్, హన్వాడా రవీందర్, బాలరాజు, రాఘవేందర్ డిప్యూటీ మేయర్ దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జర్నలిస్టులకు తాను ఎల్లవేళలా అండగా ఉంటానని భరోసా నిచ్చారు. అనిల్ తో ఫోన్లో మాట్లాడి మనోధైర్యం చెప్పారు. తన వంతుగా పూర్తి సహకారం అందిస్తానని ప్రభుత్వం నుంచి కూడా ఎల్ఓసి అందేలా కృషి చేస్తామని భరోసానిచ్చారు. నిమ్స్ వైద్యులతో మాట్లాడి ఎప్పటికప్పుడు వారితో టచ్ లో ఉంటానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు డిప్యూటీ మేయర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## ఓజోన్ సంరక్షణతోనే జీవకోటి మనుగడ హెచ్ఎం శ్రవణ్ కుమార్

### అప్పలరావుపేట జెడ్పీహెచ్ఎస్‌లో ఘనంగా ఓజోన్ దినోత్సవం

### పర్యావరణ రక్షణ, వ్యర్థాల నిర్వహణపై విద్యార్థులకు అవగాహన




**నర్సంపేట అక్షిత ప్రతినిధి :** మానవాళి మనుగడకు, భూమిపై జీవకోటి రక్షణకు అడ్డుగోడగా నిలిచే ఓజోన్ పొరను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అప్పలరావుపేట జెడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయులు బూర్గుపల్లి శ్రవణ్ కుమార్ అన్నారు. బుధవారం పాఠశాల ప్రాంగణంలో ఆయన అధ్యక్షతన ప్రపంచ ఓజోన్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ.. సూర్యుని నుంచి వెలువడే ప్రమాదకరమైన అతినీలలోహిత (యూవీ) కిరణాలు నేరుగా భూమిపై పడకుండా ఓజోన్ పొర గొడుగులా కాపాడుతోందని తెలిపారు. విపరీతమైన కాలుష్యం, రసాయనాలు, క్లోరోఫ్లోరో కార్బన్ల (సీఎఫ్‌సీ) విడుదల తదితర కారణాల వల్ల ఓజోన్ పొర దెబ్బతింటోందని ఆందోళన వ్యక్తం చేశారు. పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు ఏసీలు, రిఫ్రిజిరేటర్లు, ఏరోసోల్ ద్రావణాల వాడకాన్ని వీలైనంత మేర తగ్గించి ఓజోన్ సంరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. పర్యావరణ కాలుష్యానికి ప్రధాన కారణమవుతున్న ఘన, ఈ-వ్యర్థాల (ఎలక్ట్రానిక్ వేస్ట్) నిర్వహణపై విద్యార్థులకు శ్రవణ్ కుమార్ పలు సూచనలు చేశారు. ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా విడనాడాలని, పచ్చదనం కోసం విరివిగా మొక్కలు నాటాలని కోరారు. ఇళ్లలో ఉత్పత్తయ్యే తడి, పొడి చెత్తను వేరుచేసి ప్లాస్టిక్ వ్యర్థాలను రీసైక్లింగ్‌కు పంపాలన్నారు. పాడైపోయిన మొబైల్ ఫోన్లు, కంప్యూటర్లు, బ్యాటరీల వంటి ఎలక్ట్రానిక్ వ్యర్థాలను ఇష్టానుసారంగా భూమిలో పారేయడం వల్ల వాటిలోని భార లోహాలు నదులు, భూగర్భ జలాల్లో కలిసి విషతుల్యమవుతున్నాయని హెచ్చరించారు. వీటిని శాస్త్రీయ పద్ధతిలో పునర్వినియోగానికి తరలించడం ద్వారానే పర్యావరణాన్ని కాపాడుకోగలమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు రవీంద్రనాథ్, గీత, యాకయ్య, భూలక్ష్మి, వెంకట్రాజం, దయాకర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల పక్షాన నేను అండగా నిలుస్తా

### మంచి చదువులు చదువుకోండి మీకు అండగా నేను ఉంటా

### అమ్మ, సోదరుడు జ్ఞాపకార్థం విద్యార్థులకు బూట్లు, పెన్ను, పెన్సిల్స్, స్వీట్లు పంపిణి

### మాజీ ఎమ్మెల్యే, మాజీ పార్లమెంట్ సభ్యులు రావుల చంద్రశేఖర్ రెడ్డి



**వనపర్తి అక్షిత ప్రతినిధి :** విద్యార్థుల పక్షాన నేను అండగా నిలుస్తా మంచి చదువులు చదువుకోండి ఎప్పుడు ఎ అవసరం వచ్చిన నా దృష్టికి తీసుకువస్తే సమస్యను పరిష్కరించే దిశగా ఉంటానని మాజీ ఎమ్మెల్యే, మాజీ పార్లమెంట్ సభ్యులు, బిఆరెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావుల చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. బుధవారం వనపర్తి జిల్లా కొత్తకోట మండలం కానాయపల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు మాజీ ఎమ్మెల్యే రావుల చంద్రశేఖర్ రెడ్డి తల్లి పద్మమ్మ, సోదరుడు డాక్టర్ వెంకట్ రంగారెడ్డి జ్ఞాపకార్థంగా బూట్లు, పెన్నులు, పెన్సిల్స్, స్వీట్లు, రిటైర్డ్ ఉపాధ్యాయులు పలుస శంకర్ గౌడ్ తో కలిసి పంపిణి చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే రావుల మాట్లాడుతూ విద్యార్థులకు ప్రతియేటా పాఠశాలలో బూట్లు అందజేస్తామని తెలిపారు. ఇంకా పాఠశాలలో కొన్ని సమస్యలు ఉన్నాయి వాటిని నా దృష్టికి తెచ్చారు అవి కూడా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా నాణ్యమైన భోజనంతో పాటు విద్యను అందించి వారికి మంచి భవిష్యత్తును ఇవ్వాలని సూచించారు. అనంతరం విద్యబుద్దులు నేర్పుతున్న ఉపాధ్యాయులను రావుల శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం కానాయపల్లి వాకింగ్ గ్రూప్ సభ్యులకు యూనిఫామ్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ యాదయ్య సాగర్, గ్రామ సర్పంచ్ బొంతం శిరీష సాయి, ఉప సర్పంచ్ అంజి నాయక్, మాజీ వైస్ ఎంపీపీ వడ్డే శ్రీనివాసులు, వార్డు సభ్యులు కొత్త వెంకటయ్య, మాజీ ఉప సర్పంచ్ బాజ గిరన్న, ఉద్యమకారులు శేఖర్ గౌడ్, నక్కల శాంతన్న, వెంకటేష్ సాగర్, అంజన్న, గోపాల్ రెడ్డి, రవీందర్ గౌడ్, గ్రామ అధ్యక్షులు హోటల్ రాజు, బక్క గోవర్ధన్, డీలర్ శ్రీను, కొత్తకోట బాలయ్య, భీమన్న, ఉప్పరి శ్రీను, దారమోని నాగరాజు, దారమోని మొగులయ్య, ఎర్ర వెంకటయ్య, పెద్ద కుర్మయ్య, రాజు, నర్సింహా, వాకిటి శ్రీను, శేఖర్, మన్యం, డీకే లక్ష్మణ్, గొల్ల రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## “ఇంటింటా ఇందిరమ్మ కుట్టు మిషన్” పథకం



**మహబూబ్ నగర్, అక్షిత న్యూస్:** తెలంగాణ ప్రభుత్వం బీసీ మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలను కల్పించి, వారి ఆర్థిక సాధికారతను పెంపొందించే ఉద్దేశంతో. ఇంటింటా ఇందిరమ్మ కుట్టు మిషన్ పథకం ను అమలు చేస్తోంది. ఈ పథకం ద్వారా అర్హులైన బి.సి. మహిళలకు కుట్టు మిషన్లు అందించి, ఇంటి వద్దనే కుట్టుపని ద్వారా స్వయం ఉపాధి పొందేలా ప్రోత్సహించడం జరుగుతుంది. ఈ పథకం కింద అర్హత కలిగిన బీసీ మహిళల నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి పి విష్ణు నందన్ తెలిపారు. ఆన్‌లైన్ దరఖాస్తుల నమోదు ప్రక్రియ సెప్టెంబర్ 30 వరకు పొడిగించబడిందని తెలిపారు అర్హులైన బీసీ మహిళలు నిర్దేశిత గడువులోగా తమ దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు.

ఆన్‌లైన్ దరఖాస్తులను వెబ్‌సైట్ ద్వారా నమోదు చేసుకోవచ్చని.,అర్హత కలిగిన బీసీ మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, ఇంటి వద్దనే స్వయం ఉపాధి పొందుతూ తమ కుటుంబ ఆదాయాన్ని పెంపొందించుకోవాలని ఆయన కోరారు. దరఖాస్తు చేసుకునే సమయంలో అవసరమైన వివరాలను సక్రమంగా నమోదు చేసి, నిర్దేశిత గడువులోగా దరఖాస్తు ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. పథకానికి సంబంధించిన మరిన్ని వివరాల కోసం జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి కార్యాలయం, మహేబుబ్ నగర్ సంప్రదించవచ్చని ఆయన ఈ ప్రకటన లో తెలిపారు.